సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం, 8, డిసెంబర్, 2023



నీటి ఆదాకు నిధులు
నీటిని ఆదా చేయడంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. - 8లో



గిరిజన వర్సిటీలో యువసంఘం ఫేజ్-3 ప్రారంభం - 8లో
ఎక్స్‌పోజర్ టూర్‌లో పాల్గొనేందుకు 45 మంది విద్యార్థులు, నలుగురు అధ్యాపకులతో కూడిన బృందం బయలుదేరింది.



నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు - 8లో
క్రీడల ఖిల్లా విజయనగరం రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమైంది.

న్యూస్‌రీల్

హాట్ బజార్ నిర్మాణానికి స్థల సేకరణ



హాట్ బజార్ నిర్మాణం కోసం స్థల సేకరణ చేస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామ సమీపంలోని గొడుగూడ సెంటర్లో హాట్ బజార్ నిర్మాణానికి భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులు గురువారం స్థల సేకరణ చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు, గిరిజనేతరులు ఓ చోట చేరి, వారపు సంతల మాదిరిగా చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఈ హాట్ బజార్‌ను నిర్మించనున్నారు. దీని నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరైందని, స్థల సేకరణ పూర్తి కావచ్చిందని, పనులు త్వరలో ప్రారంభించనున్నట్టు ఏఈ ఎస్.అప్పారావు తెలిపారు.

18, 19 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాలకొండ: ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ఈ నెల 18, 19 తేదీల్లో పాలకొండ పట్టణంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం మన్యం జిల్లా అధ్యక్షుడు డి.పండు వెల్లడించారు. సభలకు సంబంధించిన పోస్టర్లను గురువారం పాలకొండలో ఆయన ఆవిష్కరించారు. విద్యా రంగంలో వచ్చిన మార్పులు, సమస్యలపై సభల్లో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టి.అఖిల్, కె.శేఖర్, ఎస్.రాజు, పి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

అన్ని రంగాలపై అవగాహన

భామిని: గ్రామ వలంటీర్లకు ప్రభుత్వ విధానాలు, పథకాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని పంచాయతీరాజ్ రాష్ట్ర సహాయ కమిషనర్ కృష్ణకాంత్ సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న గ్రామ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరికి పలు విషయాలు సూచించారు. ప్రధానంగా వలంటీర్లు విధులు, సచివాలయంలో తప్పక హాజరు నమోదుపై ఆదేశించారు. ఆరోగ్యం, యోగా, ఆపన్న సహాయం అందించడంపై శిక్షణ ఇవ్వాలన్నారు. మాస్టర్ ట్రైనీలు అందిస్తున్న బోధనాంశాలపై ఆరా తీశారు. కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో పంచతంత్ర యాక్షన్ ప్లాన్

- జీసీడీఓ రోజారమణి



రేగులపాడు కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న జీసీడీఓ

వీరఘట్టం: జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో పంచతంత్ర యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా జీసీడీఓ రోజారమణి అన్నారు. వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీని గురువారం ఆమె సందర్శించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల వరకు 100 రోజుల ప్రణాళికను పాటించాలని విధివిధానాలను తెలిపారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని 14 కేజీబీవీల్లో 520 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని వీరందరూ ఉత్తీర్ణులు అయ్యేలా చూడడమే తమ లక్ష్యమన్నారు. గతేడాది ఆరు కేజీబీవీలు శతశాతం ఫలితాలు సాధించాయని, ఈ ఏడాది అన్ని కేజీబీవీలు శతశాతం ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.ఇప్పటికే వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు బోధిస్తున్నామన్నారు.

అండర్-19 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల తేదీలు ఖరారు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీలకు వేదికలు, తేదీలు ఖరారైనట్టు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పివిఎల్ఎన్.కృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఏలూరులోని ఏఎస్ఆర్ డీఎస్ఏ స్టేడియంలో త్రోబాల్ పోటీలు జరగనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం రైల్వే స్టేషన్ వద్దకు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

గిరిజన తల్లులకు నిశ్చింత

కొండకోనల్లో గర్భిణులకు గత ప్రభుత్వాల పాలనలో సంచి వైద్యులే దిక్కు. ఇప్పుడు ప్రతి గిరిశిఖర గ్రామంలోని మహిళలకు ప్రభుత్వ వైద్యం అందుతోంది. గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. గర్భం దాల్చిన నుంచి వారికి క్రమం తప్పకుండా మందులు, వైద్య పరీక్షలు చేస్తున్నారు. వసతిగృహాల్లో చేర్పించి సుఖ ప్రసవాలు అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. కానీ ఈనాడు పత్రిక మాత్రం అక్కడ చిన్నచిన్న లోపాలను భూతద్దంలో చూపిస్తూ గిరిజన మహిళల్లో భయాందోళనలు కల్పించదానికి ప్రయత్నాలు చేస్తోంది. అమాయకుల మనస్సుల్లో విషబీజాలు నాటి వారి ప్రాణాలకే ముప్పు తెచ్చేలా కథనాలను వండివార్చుతోంది.

- గిరిశిఖర గర్భిణుల వసతిగృహాలలో సుఖ ప్రసవాలు
- పండంటి బిడ్డతో గిరిశిఖర గ్రామాలకు తిరిగి సురక్షిత ప్రయాణం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నామమాత్ర వసతులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విస్తృత అవగాహన
- మహిళల్లో చైతన్యం కల్పిస్తున్న వలంటీర్లు, వైద్య సిబ్బంది



108 వాహనంలో గర్భిణిని సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లిన ఏఎన్ఎం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గిరిశిఖర గ్రామాల్లోని గర్భిణులను ప్రసవం కోసం డోలీల్లో దిగువ ప్రాంతంలోని ఆస్పత్రులకు తరలిస్తున్న దృశ్యాలు గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఎక్కువగా కనిపించేవి. సాలూరు మండలం కొదమ పంచాయతీ సిరివర గ్రామంలో కొండతామర గిందె అనే మహిళకు ప్రసవమైన తర్వాత బిడ్డ వెంటనే మృతి చెందడం, ఆమెను డోలీలో తీసుకురావడానికి జోరువానలో 12 కిలోమీటర్లు దారి పొడవున గ్రామస్తులు ఇబ్బంది పడటం మీడియాలో ప్రముఖంగా వచ్చింది. ఆ కథనాలతో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. అప్పటి టీడీపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అప్పటికప్పుడు పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీశా కాలినడకన అటవీ మార్గంలో సిరివర గ్రామానికి వెళ్లారు. అక్కడ పరిస్థితులను పరిశీలించారు. వెంటనే ఐటీడీఏ నిధులతో సాలూరులోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ వైటీసీ భవనం కూడా అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగానున్న పీడిక రాజన్నదొర హయాంలో నిర్మాణమైందే కావడం గమనార్హం. ప్రసవ సమయానికి రెండు నెలల ముందే గిరిశిఖర గ్రామాల నుంచి గర్భిణులను స్థానిక వైద్యారోగ్య శాఖ సిబ్బంది ద్వారా ఆ కేంద్రంలో చేర్పించడం ప్రారంభించారు. ఇది విజయవంతం కావడంతో గుమ్మలక్ష్మీపురంలోని వైటీసీలో మరో గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని తెరిచారు.

నాటికి నేటికీ ఎంతో తేడా...

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ప్రారంభమైన 108 వాహనాలను తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. చివరకు నిర్వహణను గాలికి వదిలేసింది. సాలూరులోని గిరిశిఖర గర్భిణుల వసతి కేంద్రానికి ఐటీడీఏ ద్వారానే అంబులెన్స్‌ను సమకూర్చారు. ఇప్పుడదే మూలకు చేరిందని ఈనాడు పత్రిక రాసింది. కేవలం ఇంజిన్ ఆయిల్ మార్చిడి వంటి చిన్న చిన్న నిర్వహణ పనులు చేయాల్సి ఉండటంతో ప్రస్తుతానికి నిలిపేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా సాలూరు ఏరియా ఆస్పత్రి పరిధిలోని 108 వాహనాలను ఉపయోగిస్తున్నారు. అంతేగాకుండా ఫ్యామిలీ డాక్టరు విధానాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత గిరిశిఖర గ్రామాల్లో ఆరోగ్య చిత్రమే మారిపోయింది. సాలూరు ఏరియా ఆస్పత్రిలో 21 మంది వైద్యులు ప్రస్తుతం పని చేస్తున్నారు. వారు ప్రతి వారంలో రెండు రోజుల పాటు గిరిశిఖర గ్రామాలకు వెళ్తున్నారు. ప్రతి ఒక్క గిరిజనుడికీ అవసరమైన వైద్యం చేస్తున్నారు. ఉచితంగా మందులు అందిస్తున్నారు. గర్భిణులను మాత్రం ప్రసవానికి రెండు నెలల ముందు 108 వాహనంలో గిరిశిఖర గర్భిణుల వసతిగృహాలకు చేర్చుతున్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో మాతాశిశు మరణాలు కనిష్ట స్థాయికి తగ్గిపోవడమే దీనికి నిదర్శనం.

గర్భిణులకు విస్తృత అవగాహన

సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో గిరిశిఖర గర్భిణుల వసతిగృహాలను 2018 సంవత్సరంలో ప్రారంభించారు. అప్పటి నుంచి 2019 ఏప్రిల్ వరకూ 260 మంది మాత్రమే వీటిని ఉపయోగించుకున్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పుష్పశ్రీవాణి, పీడిక రాజన్నదొర తరచుగా వీటిని సందర్శిస్తున్నారు. ఎక్కడ ఏ లోపం ఉన్న చక్కదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గిరిజనుల్లో నమ్మకం కుదిరింది. గత నాలుగున్నరేళ్లలో ఇక్కడ చేరిన గర్భిణుల సంఖ్య 2,957 ఉండటమే దీనికి నిదర్శనం. ప్రసవానికి సుమారు రెండు నెలల ముందే సదరు గర్భిణులు ఈ వసతిగృహాలకు వచ్చేలా వలంటీర్లు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది గిరిశిఖర గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

వసతి గృహంలో సదుపాయాలు భేష్...

గిరిశిఖర గర్భిణుల వసతిగృహాల్లో చేరిన గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్యం కోసం యోగా చేయిస్తున్నారు. వినోదానికి టీవీ ఏర్పాటు చేశారు. రెండో కాన్పు కోసం వచ్చే గర్భిణులతో వారి పిల్లలు, తోడుగా ఒక రిద్దరు బంధువులు వచ్చి ఉండేలా ఏర్పాట్లు చేశారు.



సాలూరులోని గిరిశిఖర గర్భిణుల వసతిగృహం

ఇంటి కన్నా ఇక్కడే బాగుంది



నాకు ఈ వసతిగృహంలో ఎలాంటి ఇబ్బందులూ లేవు. మంచి పౌష్టికాహారం సమయానికి అందిస్తున్నారు. వైద్య సిబ్బంది తరుచూ వైద్య పరీక్షలు చేస్తున్నారు.

– తాడంగి రాణి, గర్భిణి, మడవలస, సాలూరు మండలం

జీతాలు సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులు...

గిరిశిఖర గర్భిణి వసతిగృహాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బందికి జీతాలను సీఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వం చెల్లిస్తోంది. అంబులెన్స్‌కు మెయింటెనెన్స్ చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే మెయింటెనెన్స్ పూర్తి చేసి ఆ అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం. సాలూరు వసతిగృహంలో కింది అంతస్తులోని బాత్‌రూమ్ పైపులు దెబ్బతిన్నాయి. ప్రత్యామ్నాయంగా పై అంతస్తులో బాత్‌రూమ్‌లు వాడుకుంటున్నారు. అవన్నీ బాగానే ఉన్నాయి.

– ఎస్.విద్యాసాగర్, సాలూరు వసతిగృహం మేనేజర్

ప్రయోజనం పొందిన గర్భిణుల సంఖ్య

వసతిగృహం	టీడీపీ ప్రభుత్వ హయాంలో చేరిన గర్భిణుల సంఖ్య	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేరిన గర్భిణులు సంఖ్య	మొత్తం
సాలూరు	180	1336	1516
గుమ్మలక్ష్మీపురం	80	1621	1701
మొత్తం	260	2957	3217



గుమ్మలక్ష్మీపురం వసతిగృహంలో యోగా చేస్తున్న గర్భిణులు (ఫైల్)

సిబ్బంది వివరాల సేకరణ

పార్వతీపురం: సాధారణ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది సమీకరణకు ఉద్యోగుల వివరాలు సిద్ధం చేయాలని డీఆర్‌ఓ జె.వెంకటరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల ఉద్యోగుల వివరాలన్నింటినీ ట్రెజరీ నుంచి తీసుకోవడం జరిగిందని, శాఖల వారి కార్యాలయాల్లో పని చేస్తున్న ఆఫీసు సబార్డినేటర్ల మినహా జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ స్థాయి వరకు ప్రతీ ఒక్కరి వివరాలు పంపించాలని తెలిపారు. తీవ్ర వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, ఎన్నికలలోపు రిటైర్‌మెంట్ గల ఉద్యోగులకు మాత్రమే మినహాయింపు ఉంటుందని తెలిపారు. సిబ్బంది వివరాలు పంపించడంలో నిర్లక్ష్యం వహించడం, పూర్తి వివరాలు పంపించకపోయినా ఎన్నికల నిబంధన ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ రూ.2లక్షల చెక్కు అందజేత



స్వాతికి రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: భామిని మండలం బాలేరు గ్రామానికి చెందిన బుర్ర రమణ ఈ ఏడాది ఆగస్టులో కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు ఆ కుటుంబం పరిస్థితిని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి తెలియజేశారు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేశారు. స్పందించిన ప్రభుత్వం రూ.2లక్షలు సీఎంఆర్ఎఫ్ కింద విడుదల చేసింది. సంబంధిత చెక్కును వండవ క్యాంపు కార్యాలయంలో మృతుని భార్య పార్వతికి ఎమ్మెల్యే కళావతి గురువారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జామి ప్రభాకరరావు, కొత్తకోట చంద్రశేఖర్, మేడిబోయిన చలపతిరావు, వలురౌతు చిరంజీవులు, గోడాలి వెంకటరమణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆదేశాల మేరకు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం విద్యనభ్యసించిన అభ్యర్థులు వారి సాంఘిక కేటగిరిలో కటాఫ్ మార్కుల కంటే ఎక్కువ సాధించిన వారు అర్హులుగా పేర్కొన్నారు.

పక్కాగా ఓటరు విచారణ

- ఎన్నికల రోల్ అబ్జర్వర్ శ్యామలరావు

పార్వతీపురం:



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ శ్యామలరావు

ఓటరు విచారణ పక్కాగా జరగాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు అన్నారు. జిల్లా పర్యటనకు గురువారం విచ్చేసిన ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఓటరు నమోదు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఫారం- 6, 7, 8 ఏ విధంగా విచారణ చేశారో ఆయా ఫారాలను జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలలో వివిధ బూత్ స్థాయి అధికారుల వద్ద స్వయంగా పరిశీలించారు. ఒక్కో బూత్ స్థాయిలో ఏ సంఖ్యలో దరఖాస్తులు అందాయో పరిశీలించారు. ఓటరు ఫారాల విచారణ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను ఆయా వ్యక్తులు సమర్పించారా .. లేదా.. సుమోటోగా సమర్పించారా వంటి విషయాలను ఆరా తీశారు. ఒకే ఇంటి నంబరుతో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండటం, ఒకేసారే గంపగుత్తుగా దరఖాస్తులు సమర్పించడం వంటి అంశాలను పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదు రోజుల నిర్వహణ, అందిన దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన ఓటర్లను తొలగించే ప్రక్రియను విచారించారు. ఒకే ఫొటోతో ఎక్కువ ఓట్లు ఉండటం, ఒకే ఓటు రెండుసార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు నమోదు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు పక్కాగా విచారణ జరగాలని, ఎండార్సుమెంటు నివేదిక సరిపోవాలని ఆయన ఆదేశించారు. విచారణకు సంబంధించిన పత్రాలు నిర్దిష్టంగా ఉండాలని, చేర్పులు మార్పులు జరిగితే వాటి వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. ఓటరు జాబితాలో ఒకే ఫొటో పలుమార్లుంటే వాటిని గమనించి ప్రామాణిక పద్ధతిలో సరి చేయాలని ఆయన చెప్పారు. ప్రతి బూత్‌లో బూత్ స్థాయి ఏజెంట్ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయా అనే విషయాన్ని కూడా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. మృతి చెందిన ఓటర్ల తొలగింపు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని, సంబంధిత పత్రాలు ఉండాలని ఆయనన్నారు. యువఓటర్ల నమోదు వేగవంతం చేయాలని, జిల్లాలో 37,873 మంది యువ ఓటర్ల అంచనా కాగా ఇప్పటికీ 8,633 మంది మాత్రమే నమోదు కావడం జరిగిందని పేర్కొన్నారు. జనాభా - ఓటరు నిష్పత్తిలో తేడాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కువ నిష్పత్తిలో ఉంటే కారణాలు విశ్లేషించాలని ఆయన సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియ, సవరణ ప్రక్రియ చక్కగా చేపట్టి తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పన చేయాలని ఆయన అన్నారు. డిసెంబరు 26వ తేదీ వరకు అందిన అభ్యంతరాలు, క్లెయింలు పరిష్కరించి తప్పులు లేని తుది ఓటరు జాబితా ప్రకటించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 1,95,069 మంది ఓటర్లు, కురుపాం నియోజకవర్గంలో 1,90,831 మంది ఓటర్లు, పార్వతీపురం నియోజకవర్గంలో 1,85,688మంది ఓటర్లు, సాలూరు నియోజకవర్గంలో 1,99,986 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన అనంతరం పాలకొండలో 3,373 మంది ఓటర్లు, కురుపాంలో 2,622 మంది ఓటర్లు, పార్వతీపురంలో 2,978 మంది ఓటర్లు, సాలూరులో 2,899 మంది ఓటర్లను చేర్చడం జరిగిందని వివరించారు. అందిన ప్రతి ఫిర్యాదును విచారించడం జరుగుతోందని ఆయన అన్నారు. మృతి చెందిన ఓటర్ల వివరాలు ఓటరు నమోదు అధికారి విధిగా పరిశీలించాలని ఆదేశించామని ఆయన చెప్పారు. జిల్లాలో ఫారం-6 దరఖాస్తులు 36,019 అందగా 27,972 జాబితాలో చేర్చడం జరిగిందని, ఫారం-7 దరఖాస్తులు 38,582 అందగా 30,375 చేర్చడం జరిగిందని, ఫారం-8 దరఖాస్తులు 94,574 అందగా 88,482 చేర్చామని, మిగిలినవి విచారణలో ఉన్నాయని తెలిపారు.

ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ బూత్ స్థాయిలో చేర్చిన ఓటర్ల వివరాలు పార్టీలకు అందించడం వలన అపోహలకు తావుండదని సూచించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ఈవీఎం తనిఖీ తదితర ఎన్నికల అంశాలు సజావు గా జరుగుతున్నాయన్నారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి సమాచారం అందిస్తుందని, ఫిర్యాదులను పరిష్కరిస్తుందని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఓటరు నమోదు అధికారులు, సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పీఓలు కల్పనాకుమారి, సి.విష్ణుచరణ్, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, ఎం.లావణ్య, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ జి.కేశవనాయుడు, పార్టీ ప్రతినిధులు మరిశర్ల బాపూజీ నాయుడు, జి.వెంకటనాయుడు, రెడ్డి వేణు, బడే శ్రీనివాసరావు, పారిశర్ల అప్పారావు, పి.రవి కుమార్, టి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా సంఘం ఎ గ్రేడ్‌లో ఉండాలి : పీడీ



వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందితో సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

కొత్తవలస: వైఎస్సార్ క్రాంతి పథంలో గల ప్రతీ మహిళా సంఘం నిర్వహణ ఏ గ్రేడ్‌లో వుండే విధంగా చూడాలని ఆ శాఖ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి సూచించారు. మండల పరిషత్ భవనంలో ఎల్.కోట, వేపాడ, కొత్తవలస మండలాలకు చెందిన ఏపీఓలు, సీసీలు, వీఓఏలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నిర్వహణ, పొదుపు, రుణాలు చెల్లింపు, స్వయం ఉపాధి యూనిట్లు నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో మహిళా సంఘాల్లో పొదుపు రూ.500 కోట్లు ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం శృంగవరపుకోట, గరివిడి మండల కేంద్రాల్లో మహిళా మార్టులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఈ షాపులు లాభాల్లో నడుస్తున్నట్టు తెలిపారు. త్వరలో గజపతినగరం, బొబ్బిలి, చీపురుపల్లిలో మహిళామార్టులు ఏర్పాటు చేస్తామన్నారు. కొద్ది నెలల క్రితం లక్కవరపుకోట మండలం కల్లేపల్లి గ్రామం వీఓఏ హత్యకు గురైన విషయంపై ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో జరిగిన లావాదేవీలపై పూర్తి సమీక్ష నిర్వహించామని త్వరలో పరిష్కరిస్తామన్నారు.

తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- కలెక్టర్, జేసీలతో సమావేశంలో అధికారులకు జెడ్పీ చైర్మన్ సూచన

విజయనగరం అర్బన్: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో రైతుల నుంచి తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులను ఆదుకొనేందుకు వీలుగా నిబంధనలు సడలించే అవకాశం ఉన్నందున జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చేటప్పుడు వాటిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవలసి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించి చర్చించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో భారీ వర్షాల కారణంగా పొలాల్లో కుప్పలుగా వేసిన ఉన్న వరి పంట కొంత మేరకు దెబ్బతిన్నదని తేమ శాతం విషయంలో కొంతమేరకు నిబంధనలు సడలించి కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. వారం రోజుల అనంతరం రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే తెరచి సిద్ధం చేయాలని పౌర సరఫరాల సంస్థ అధికారులకు సూచించారు. జిల్లాలో తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు విషయంలో రైతాంగానికి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు వెంటనే చర్యలు చేపడదామన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చినమేరంగి పోలీస్‌స్టేషన్ సందర్శన



చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్‌ను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం సందర్శించారు. వార్షిక తనిఖీ నిమిత్తం స్టేషన్‌ను సందర్శించానని తెలిపారు. ఈ సందర్భంగా చినమేరంగి సీఐ ప్రసాద్, ఎస్సై కళాధర్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌వో, రైటర్, కంప్యూటర్, సిబ్బంది గదులను పరిశీలించారు.కేస్ ప్రాపర్టీ భద్రపరచిన గదులు, సీజ్ చేసిన వాహనాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, క్రైమ్ రికార్డులను, కేసు నమోదు నుంచి డిస్పోజల్ వరకు గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు.పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసుల ఫైల్స్, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ,డ్యూటీ రోస్టర్,ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టుకు సంబంధించిన రికార్డ్స్ పరిశీలించారు.కేసుల దర్యాప్తు విధానం,పురోగతి గురించి ఆరా తీసి, సదరు కేసుల ఛేదింపు విషయంలో దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి అజీజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాటిపూడిలో మహిళ కోసం గాలింపు



బుచ్చి అప్పారావు జలాశయంలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

గంట్యాడ: గెడ్డలో కొట్టుకుపోయిన ఓ మహిళ కోసం తాటిపూడి(గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం) వద్ద ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు గాలింపు చేపట్టారు. అనంతగిరి మండలం భీమపోలు గ్రామానికి చెందిన ముగ్గురు ఉవ్వ గెడ్డ దాటుతుండగా వరద ప్రవాహానికి కొట్టుకుపోయారు. వారిలో మిరియాల జన్ని కుమార్ (25), గమ్మెల లక్ష్మి(55) మృతదేహాలు లభ్యమయ్యాయి. మిరియాల కమల(45) ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బుచ్చి అప్పారావు జలాశయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ గాలింపు చేపట్టింది.

వ్యాన్, లారీ ఢీ: డ్రైవర్‌కు గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం స్వీట్ హోం సమీపంలో బుధవారం రాత్రి వ్యాన్, లారీ ఢీకొన్న సంఘటనలో వ్యాన్ డ్రైవర్ శివాజీకి స్వల్ప గాయాలయ్యాయి. గజపతినగరం నుంచి రామభద్రపురం వెళ్తున్న వ్యాన్‌ను మరడాం నుంచి గజపతినగరం వెళ్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయాలపాలైన డ్రైవర్‌ను గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పెదమానాపురం ఎస్సై శిరీష వద్ద ప్రస్తావించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గ్యాస్ లీకైన ప్రమాదంలో మరో మహిళ మృతి



ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనంలో చికిత్సకు తరలిస్తున్న శ్రావణి (ఫైల్)

లక్కవరపుకోట: మండల కేంద్రం లక్కవరపు కోటలోని గవరవీధిలో గత నెల 19వ తేదిన గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయిన ఘటనలో ఇద్దరు మహిళలతో పాటూ ముగ్గురు చిన్నారులు తీవ్రంగా కాలిపోయిన విషయం పాఠకులకు విదితమే. ఈ ప్రమాదంలో మరో మహిళ కె.శ్రావణి (30) గురువారం మృతి చెందినట్లు ఎస్సై ముకుందరావు తెలిపారు. క్షతగాత్రులంతా విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తామరాపల్లి వెంకటలక్ష్మి(50) గత నెల 29న మృతి చెందింది. కాగా చికిత్స పొందుతున్న ముగ్గురు చిన్నారుల పరిస్థితి కూడా ఆందోళన కరంగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా దయానంద్



కె. దయానంద్

విజయనగరం అర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాకు చెందిన కె.దయానంద్‌ను పార్టీ నియమించింది. ఈ మేరకు రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్.మణినాయుడు గురువారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఈ సందర్భంగా దయానంద్ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160

నీటి ఆదాకు నిధులు

- ప్రభుత్వ భవనాల వద్ద వర్షపునీటి నిల్వకు హార్వెస్టింగ్‌లు
- జగనన్నకాలనీల్లో ఇంకుడు గుంతలు
- జిల్లా వ్యాప్తంగా నిధుల మంజూరు



రాజాం మండలంలోని రాజయ్యపేట గ్రామ సచివాలయ సముదాయం వద్ద హార్వెస్టింగ్ స్ట్రక్చర్

రాజాం: నీటిని ఆదా చేయడంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వినూత్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో చేపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రకృతి వనరులను కాపాడుకుంటూ భవిష్యత్ జీవనానికి మార్గాలు రూపొందిస్తోంది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వర్షపు నీటి వృథాను అరికట్టి, గ్రామాల్లో అపరిశుభ్రతను పారదోలేందుకు చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు

జిల్లాలో అన్ని గ్రామ సచివాలయాలు ప్రభుత్వ భవన సముదాయాలతో కళకళలాడుతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రజలు కార్యాలయాలకు వస్తున్నారు. వారికి అవగాహన కల్పించడంతో పాటు ఇక్కడ వర్షపు నీటిని పొదుపుచేసే విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను సచివాలయాల సముదాయాల వద్ద నిర్మిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా 324 స్ట్రక్చర్లు మంజూరు కాగా, ఇప్పటివరకూ 81 స్ట్రక్చర్లను పూర్తిచేశారు. ఇవి పెద్ద తరహా ఇంకుడుగుంతలు మాదిరిగా ఉంటాయి. సచివాలయ భవన సముదాయాల వర్షపునీరు నేరుగా ఈ నిర్మాణాల్లోకి చేరుతుంది. వీటి నిర్మాణానికి ఒక్కోదానికి రూ. 64,000 నిధులు ఎస్ఆర్ఈజీఎస్ కేటాయించింది.

4,876 ఇంకుడు గుంతలు

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల నిర్మాణం చకచకా జరుగుతోంది. వీటి నిర్మాణంతో కొత్తగా గ్రామాలే ఏర్పడుతున్నాయి. ఈ కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంతల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ గుంతల నిర్మాణానికి లబ్ధిదారుకు ఎస్ఆర్ఈజీఎస్ రూ.6 వేలు చెల్లిస్తోంది. వర్షపునీటితో పాటు వాడుక నీరు ఇందులోకి వెళ్లడం ద్వారా నీటి ఆదా జరగనుండడంతో పాటు, మురుగునీటి సమస్య గట్టెక్కనుంది.

ప్రతి గ్రామంలో సోప్ పిట్

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మురుగుసమస్య ఎక్కువవుతోంది. ఆయా గ్రామాల్లో మురుగు కాలువల ద్వారా వచ్చే నీరు శివారు ప్రాంతాల్లోని పంటపొలాలు, చెరువుల్లో చేరి పరిసరాలు కలుషితమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ సోప్ పిట్ల నిర్మాణానికి పలు గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలోని 206 గ్రామాల్లో వీటిని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేయగా, ఒక్కోగ్రామానికి రూ. 58వేల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణంతో ఆయా గ్రామాల మురుగునీరు ఈ పిట్లలోకి చేరి, గ్రామాల్లో పరిశుభ్రత కనిపించనుంది.



సంతకవిటి మండలం తాలాడలో మోడల్ సోప్ పిట్

నిధులు మంజూరు

జిల్లాలో రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, ఇంకుడు గుంతలు, సోప్ పిట్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పలు మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు అవగాహన కల్పించాం. ఆయా గ్రామాల్లో సచివాలయాలు వద్ద హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభమైంది.

జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ, విజయనగరం

బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: స్వాతంత్య్ర సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటుకు తాటిపూడి జలాశయం (బుచ్చిఅప్పారావు జలాశయం) వద్ద గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం స్థల పరిశీలన చేశారు. ఏడున్నర అడుగుల విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. బుచ్చి అప్పారావు విగ్రహం అన్ని వైపులా కనిపించేవిధంగా నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆ తర్వాత తాటిపూడి జలశయాన్ని పరిశీలించారు. రబీకి నీరు ఇచ్చే విధంగా జలాశయంలో నీరు ఉందని సంతృప్తి వెలిబుచ్చారు. జలాశయంలో ఉన్న లీకులను పూర్తి స్థాయిలో అరికడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంధిరామునాయుడు, పార్టీ జామి మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఇరిగేషన్ ఏఈ తమ్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు నారాయణమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

1000 సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర, సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా రవాణా, తయారీ కేంద్రాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తున్నామని ఎస్ఈబీ సీఐ ఎల్. ఉపేంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మండలం ములగ గ్రామం సమీపంలో సారా రవాణాపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం మైదాన ప్రాంతాలకు సారా రవాణా చేస్తున్న పార్వతీపురం మండలం బిల్లగుడ్డివలస గ్రామానికి చెందిన కొండగొర్రి నగేష్‌ను అదుపులోకి తీసుకుని 1000ప్యాకెట్ల సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని తెలిపారు.

22కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ సలీమ్‌ను అరెస్టు చేసి, 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైల్వేస్టేషన్ సమీపంలో ఉదయం 10 గంటల సమయంలో బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గంజాయి ప్యాకెట్లు గుర్తించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన ఎస్సై భాస్కరరావు, సిబ్బందిని సీఐ అభినందించారు.

బంగారం దొంగ అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురంటౌన్: మహిళల మెడలో బంగారు చైన్లను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు పార్వతీపురం మన్యం జిల్లా క్రైం పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఈ మేరకు పట్టుబడిన దొంగను గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరుల ముందుంచారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణారావు మాట్లాడుతూ 2023 జనవరి నుంచి నవంబరు వరకు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మహిళల మెడలో చైన్ల చోరీకి సంబంధించి దొంగలు మన రాష్ట్రానికి చెందిన వారా లేదా అన్న కోణంలో క్రైం పోలీసులు దర్యాప్తు చేశారన్నారు. ఈ 11 నెలల కాలంలో పార్వతీపురంలోని చర్చివీధి, జనశక్తి కాలనీ, రామానంద్ నగర్, వైకేఎం కాలనీతో పాటు బొబ్బిలిలో జరిగిన బంగారు చైన్ల దొంగతనాలకు ఒకే వ్యక్తి పాల్పడినట్లు క్రైం పోలీసులు నిర్ధారించారన్నారు. చోరీలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, ఎలా దొంగతనం చేశాడనే విషయంపై క్రైం పోలీసులు విస్తృతంగా పరిశోధన చేసి పట్టుకున్నారని తెలిపారు. చివరకు పార్వతీపురం పట్టణంలోని పెద్దాకలి వీధికి చెందిన బుక్కూరు లక్ష్మణరావు చోరీలకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఐదు కేసులకు సంబంధించి చోరీకి పాల్పడిన నిందితుడి నుంచి 9.2 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ సుధాకర్‌తో పాటు పట్టణ హెచ్‌సీ రాజశేఖర్, సీసీఎస్ హెచ్‌సీలు నారాయణ, గోవింద్, పీసీ ఉదయ్‌లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించినట్లు సీఐ తెలిపారు.

అంగన్‌వాడీల రాష్ట్ర సమ్మె తాత్కాలిక వాయిదా

విజయనగరం ఫూల్‌బాగ్: అంగన్‌వాడీల రాష్ట్ర సమ్మె తాత్కాలంగా వాయిదా పడినట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు వి.లక్ష్మి, అధ్యక్షురాలు బి.పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనసూయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి సమ్మె తలపెట్టిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో ఎక్కవ జిల్లాల్లో తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలు కష్టాల్లో ఉన్నారు. పంటలు నష్టపోయి, కొన్ని చోట్ల ఇళ్లు కోల్పోయారు. అంగన్‌వాడీ సెంటర్లు కూడా నీటమునిగాయి. బాధితులకు ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో భోజనాలు, వసతులు ఏర్పాటు చేసింది. కాబట్టి అంగన్‌వాడీలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

తుఫాన్ మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: అల్లూరి జిల్లాలో తుఫాన్ ప్రభావంతో వరదల్లో కొట్టుకుపోయిన పలువురు కుటుంబాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు గురువారం పరామర్శించారు. అనంతగిరి మండలం భీంపోలు సమీపంలోని ఉవ్వా గెడ్డలో కొట్టుకుపోయిన సీతపాడు గ్రామంలోని ముగ్గురు గిరిజనులు మిరియాల కమల, గెమ్మెల లక్ష్మి, కుమార్ కుటుంబాలను కలిసినట్లు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్లు



ఎంపికైన క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ స్త్రీ, పురుష విభాగాల జట్లను జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాల జీఎంఆర్ ఐటీ కళాశాల రాజాంలో జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో తుదిజట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. స్త్రీల, పురుషుల జట్లలో ఎంపికైన వారిలో బి.ప్రశాంత్ (విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), ఎం.భార్గవ రాజు గుప్త (గొన్నా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సైన్స్), ఐ.సతీష్ (ఐతం కాలేజ్, టెక్కలి), ఎ.వినయ్‌కుమార్ (డైట్ కళాశాల అనకాపల్లి), కె.మౌనీష్ (జీఎంఆర్ ఐటీ, రాజాం), హెచ్.పూజిత (ఐతం, టెక్కలి), వై.ప్రజ్ఞాకుమారి (లెండి కాలేజీ, విజయనగరం) ఉన్నారు. ఎంపికైన జట్టు సభ్యులను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవీపాపారావు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ డాక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి అభినందించారు.

వాహన చోదకుడిపై కేసు నమోదు

పాలకొండ రూరల్: మండలంలోని మంగళాపురం వద్ద నాగావళి నదిపై గల వంతెనపై నడుస్తున్న వ్యక్తులను వెనుకనుంచి బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జీఎం.పురానికి చెందిన నల్లబారిక గురుమూర్తి మరికొందరు బుధవారం రాత్రి నడుస్తుండగా రేగిడి అమదాలవలస మండలానికి చెందిన ద్విచక్ర వాహన చోదకుడు గేదెల సురేష్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో గాయాలపాలైన గురుమూర్తిని మెరుగైన వైద్యసేవల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పై పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్ గురువారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

- రాజీవ్ క్రీడా మైదానం వేదికగా మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరు కానున్న వివిధ జిల్లాలకు చెందిన 500 మంది క్రీడాకారులు
- సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో పోటీ



ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు సాధన చేస్తున్న క్రీడాకారులు

విజయనగరం: క్రీడల ఖిల్లా విజయనగరం రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమైంది. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే అంతర్‌జిల్లాల పోటీలకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో ఈ పోటీలు నిర్వహించనుండగా..పోటీల్లో ఆతిథ్య విజయనగరం జిల్లా క్రీడాకారులతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనున్నారు. ఈ నెల 8,9,10 తేదీల్లో పోటీల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు అవసరమైన భోజన, వసతి సదుపాయాలు సమకూర్చారు. రాష్ట్రస్థాయి (అండర్-14) పోటీలు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానుండగా..9వ తేదీ సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా క్యాడెట్ (అండర్-17) విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు 10వ తేదీన బహుమతులు అందజేయనున్నారు.

జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు

రాష్ట్రస్థాయిలో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో జిల్లా వేదికగా నిర్వహించే ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో 18 మంది క్రీడాకారులు, క్యాడెట్ విభాగంలో 22 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

క్యాడెట్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారుల ఎంపికను రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో భాగంగా చేపట్టనున్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19,20,21 తేదీల్లో గుజరాత్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారి ప్రసాద్ తెలిపారు.

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో గురాన అయ్యలు, వేణుగోపాలరావులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. రాష్ట్రం తరఫున పోటీపడిన కుశాల్, పునీత్, సాత్విక్, కె.సాహిత్యలు వెండిపతకాలు కైవసం చేసుకోగా..సంకీర్తన, గుణదీప్, వి.దేవన్, మణికంఠ, చరిష్మాలు కాంస్య పతకాలు చేజిక్కించుకుని విద్యలనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు చేరుకున్న క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

1334 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత



గరుడుబిల్లిలో సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం బస్తాలు

బొండపల్లి: మండలంలోని ముద్దూరు, గరుడుబిల్లి గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన 1334 కేజీల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని సంబంధిత వ్యక్తులపై 6ఎ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ గురువారం సాయంత్రం తెలిపారు. ముద్దూరు గ్రామంలో వడ్డాది శ్రీనివాసరావు ఇంట్లో 10 బస్తాల్లో నిల్వ చేసిన 499 కేజీల బియ్యంతో పాటు, గరుడుబిల్లి గ్రామంలో బండారు శ్రీనివాసరావు ఇంట్లో 19 బస్తాల్లో నిల్వ చేసిన 835 కేజీల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని ఆయా గ్రామాల డీలర్లకు అప్పగించినట్లు చెప్పారు. బియ్యం నిల్వ చేసిన ఇద్దరు నిందితులపై 6ఎ కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందచేసినట్లు తెలిపారు.

గిరిజన వర్సిటీలో యువసంఘం ఫేజ్-3 ప్రారంభం



ఎక్స్‌పోజర్ టూర్ బృందం బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: న్యూఢిల్లీలో పదిరోజుల పాటు నిర్వహించే ఎక్స్‌పోజర్ టూర్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న 45 మంది విద్యార్థులు, నలుగురు అధ్యాపకుల బృందం బస్సును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఏక్ భారత్ శ్రేష్ట భారత్ -యువ సంఘం కార్యక్రమంలో భాగంగా వారం తా వెళ్తున్న సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ భిన్న భాషలు, విభిన్న ఆలోచనా విధానాలు, విభిన్న ఆహారపు అలవాట్లు ఉండవచ్చు కానీ మనమందరం హృదయంతో ఐక్యంగా ఉన్న భారతదేశ ఆత్మలమన్నారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి మాట్లాడుతూ అద్భుతమైన జాతీయవాద కార్యక్రమంలో యూనివర్సిటీ బృందం చేరడం సంతోషంగా ఉందన్నారు. యువసంఘం అనేది విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా ఏక్ భారత్ శ్రేష్ట భారత్ (ఈబీఎస్‌బీ) కింద ఒక చొరవ అని, ఇది 'ప్రజల నుంచి ప్రజల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం, మన దేశంలోని రాష్ట్రాల యువత మధ్య సానుభూతిని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో సుసంపన్నమైన, వైవిధ్యమైన వారసత్వం గురించి తెలుసుకుంటూ సాంస్కృతిక అవగాహన పెంపొందించడానికి, ఆలోచనల మార్పిడికి యువకులకు ఇది వేదికగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కివాడే, యూనివర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.